www.vastavam.in

వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| గురువారం | 17-07-2025 |

తెలంగాణ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే అగ్రభాగాన ఉంది

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వాస్తవం, నిజామాబాద్ :

రాష్ట్ర పేరుతో ఏర్పాటైన తెలంగాణ విశ్వవిద్యాలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గర్వంగా చెప్పారు. చైతన్యవంతమైన ఈ మట్టిలోని ప్రజల ఆకాంక్షలు విశ్వవిద్యా లయ అభివృద్ధికి స్ఫూర్తినిస్తున్నాయన్నారు. 2006లో 6 కోర్సులతో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాల యం ఇప్పుడు 7 విభాగాల్లో 24 ఉపవిభాగాలు, 31 కోర్సులతో బిక్నూరు, సారంగపూర్ క్యాంపస్‌లతో విస్తరించిందని పేర్కొన్నారు. గత 19 ఏళ్లలో అధ్యాపకులు, విద్యార్థుల కృషి ప్రతిబింబిస్తుందన్నారు. స్నాతకోత్సవం నాణ్యమైన విద్య, ఉపాధి కల్పనకు మార్గాన్ని నిర్దేశిస్తుందని, 2023-24 ఆర్థిక సర్వే ప్రకారం 51% పట్టభద్రులు ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు.

ఉల్టా చోర్ బీఆరెస్..!

మేం కలిస్తే కడుపుమంట..!

చర్చిస్తే సైకోయిజం..! మేం తన్నుకుంటే తమాషా !

ఇదీ బీఆరెస్ దుఃఖం... వారికిక లేదు సుఖం..

జనానికే మేం జవాబుదారీ.. మీకు కాదు..!

తెలంగాణ హక్కులను ఏపీకి ధారాదత్తం చేసిన కేసీఆర్..

వివాదాలు లేకుండా నీటివాటాల పరిష్కారం చేస్తాం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బనకచర్లకు సంబంధించి తాము చేసిన ఫిర్యాదులపై కేంద్ర ప్రభుత్వం పరిధిలోని సంస్థలు స్పందించి అభ్యంతరాలు చెప్పినందున ఆ అంశమే ప్రస్తావనకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసి అన్యాయం చేశారని.. వాటిని పరిష్కరించడానికి విధివిధానాలను ముందుకు తీసుకువచ్చామని అన్నారు. జల్‌శక్తి కార్యాలయంలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు, ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశం అనంతరం ముఖ్యమంత్రి బుధవారం విలేకరులతో మాట్లాడారు.

ఢిల్లీ- వాస్తవం:

టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటు, శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించడం తెలంగాణ విజయమని రేవంత్ రెడ్డి తెలిపారు. చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. సుహృద్భావం వాతావారణం చెడిపోతే బాగుండునని కొంతమందికి ఉందని... ఇరు రాష్ట్రాలు కొట్టుకుంటే తమకు బాగుంటుందని వాళ్లు అనుకుంటున్నారని... వారిని చూసి జాలిపడడం తప్ప ఏం చేయలేమని బీఆరెస్‌నుద్దేశించి ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా బీఆరెస్ ఏ సమస్య పరిష్కరించలేకపోయిందని.. వాళ్ల దుఃఖాన్ని, బాధను తాము అర్థం చేసుకుంటామని విమర్శించారు. బీఆరెస్‌కు సమాధానం ఇవ్వడానికి తాము లేమని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా తామున్నామని.. పరిపాలన ఎలా చేయాలో తమకు తెలుసని సీఎం తెలిపారు. వివాదాలు చెలరేగకుండా సమస్యలను శాశ్వత పరిష్కారం చూపడం తమ బాధ్యతని సీఎం తెలిపారు.

పాచినోటినే.. పరిగడపునే తప్పతాగేస్తున్నారు!

డే టైం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో దొరికిన స్కూల్ బస్సు డ్రైవర్లు..

వాస్తవం ప్రతినిధి - హైదరాబాద్:

సిటీలో తాగి బండి నడపాలంటే ఉచ్చపడతది. కానీ పోలీసులు చెక్ చేసేది ఏ రాత్రికో. అదే ఇప్పుడు అలుసుగా మారింది. ఎంతలా అంటే పరిగడపునే, పాచినోటినే కానిచ్చేస్తున్నారు. తప్పతాగేస్తున్నారు.మమ్మల్ని ఆపేదెవడు..? అని రయ్యు రయ్యున సిటీ రోడ్ల మీద తాగి .. వాహనాలను తైతక్కలాడుతున్నారు. వారు వీరు అని కాదు. ఇందులో ఏకంగా స్కూల్ బస్సు డ్రైవర్లే ఉండటం దారుణం. ఈ విషయం తెలిసి పోలీసులు నోరెళ్లబెట్టారు. అవాక్కై ఔరా ఇదెక్కడి దారుణమని ముక్కుమీద వేలేసుకున్నారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా ఒకే రోజు 25 మంది స్కూల్ బస్సు డ్రైవర్లు అదే రూట్‌లో దొరికిపోయారట. అంటే సిటీలో ఇంకెన్ని బస్సులున్నయి.. ఎంత మంది తాగి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారో...? స్కూల్ బస్సు నడుపుతున్నాం.. కదా మమ్మల్ని సాఫ్ట్ అనుకోవద్దు.. లోపల ఒరిజినల్ అట్లనే ఉన్నదని నిరూపించారీ డ్రైవర్లు. దీంతో అలర్టయిన సిటీ పోలీస్ ఇకపై డే టైంలో కూడా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తారట. చచ్చింది గొర్రె.



తండ్రి చాటు బిడ్డెగా ఉంటూనే తన దారి తను చూసుకుంటున్న కవితకు .. తాననుకున్న సమయం రానే వచ్చింది. పాము పగ తోక చుట్టంలా.. గులాబీ కండువా మెడలో వేసుకోకుండా.. కేసీఆర్ చిత్రపటాన్ని మాత్రం వాడుకుంటూ తన కార్యకలాపాలు చేస్తున్న కవితకు డబుల్ గేమ్‌కు కేసీఆర్ చెక్ పెట్టేశాడు. పార్టీ నుంచి ఆమెను బహిష్కరిస్తున్నట్టు చెప్పకనే చెప్పేశారు. ఇక ముసుగులో గుద్దులాటలుండవు. కేసీఆర్‌కు ఇది నచ్చదు. కవిత ఆయన డైరెక్షన్‌లోనే ఇదంతా చేస్తుందనే అపప్రదను, ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్నాడు. దీనికి వేదికగా తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీజీబీకేఎస్)ను వాడుకున్నాడు. ఇప్పటి వరకు దీనికి కవితే గౌరవ అధ్యక్షురాలు. కానీ ఆమెను ఆ బాధ్యతల నుంచి తప్పించేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పూర్తి ఇంచార్జి బాధ్యతలు అప్పగించేశారు.

కవితపై బీఆరెస్ బహిష్కరణాస్త్రం..!

టీజీబీకేఎస్ బాధ్యతల నుంచి తప్పించిన అధిష్టానం..

కేసీఆర్ ఆదేశాలతో .. కొప్పుల ఈశ్వర్‌కు బాధ్యతల అప్పగింత..

అధికారికంగా కేటీఆర్ ప్రకటన.. !

ఇవాళ కవిత హడావుడి ప్రెస్‌మీట్... భవిష్యత్ కార్యాచరణ, నిర్ణయాలపై క్లారిటీ..!

(దండుగుల శ్రీనివాస్)

కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ సంఘం ప్రతినిధులతో మీటింగు పెట్టుకున్న కేటీఆర్ ఈ మేరకు ఈ నిర్ణయాన్ని స్వయంగా తనే ప్రకటించాడు కూడా. కవిత ఇష్యూను కేసీఆర్ చాలా సీరియస్‌గా తీసుకున్నాడు. ఆమెను ఇలాగే వదిలేస్తే పార్టీకి మరింత నష్టం వాటిల్లుతుందని భావించాడు. తీన్మార్ మల్లన్న తో జరిగిన వివాద ఉదంతంలో పార్టీ నేతలు ఎవరూ చప్పుడు చేయలేదు. పార్టీ గొడుగు కిందే ఉన్నట్టుగా ఉంటూ తన సొంత ఎజెండాను అమలు చేస్తే ఇంకా చూస్తూ సైలెంట్‌గా ఉంటే.. మరింత నష్టం జరగడం ఖాయమని కేసీఆర్ భావించాడు. అందుకే ఈ విధమైన నిర్ణయంతో ఆమెకు పార్టీకి ఇక ఎలాంటి సంబంధాలు లేవనే సంకేతాలిచ్చాడు గులాబీ బాస్. ఈ ప్రకటన వెలువడగానే కవిత కూడా తను గురువారం ఉదయం తన నివాసంలో ప్రెస్ మీట్ పెడుతున్నట్టు రాత్రి హడావుడి ప్రకటన విడుదల చేసింది. మీడియాతో చాలా విషయాల్లో క్లారిటీ ఇవ్వనుంది. ఇంకా ఆమె డబుల్ గేమ్ ఆడే పరిస్థితి లేదు. జనం నమ్మరు. ఇప్పటికే కవిత కార్యకాలాపాలపై చాలా అనుమానాలున్నాయి. ఆమె మాటల్లో క్లారిటీ మిస్సవుతోంది. లక్ష్యం ఒకటి.. చేస్తున్న పనులు వేరు... మొత్తానికి జనాన్ని చాలా కన్ఫ్యూజ్ చేసే కార్యక్రమాలు చేస్తూ వస్తున్నదామె. దీని వల్ల బీఆరెస్ పార్టీకి చాలా డ్యామేజీ జరిగింది. మొన్నటి వరకు ఓపికగా ఉండి అన్నీ గమనిస్తూ వచ్చిన కేసీఆర్.. ఇక కవిత ఆశలకు, ఆలోచనలకు, దూకుడుకు కళ్లెం వేయనున్నాడు. ఆమెకు ఇక పార్టీకి రాం రాం అనే సంకేతం ఇచ్చేశాడు. ఇక తాడోపేడో నువ్వే తేల్చుకో అని కవితకు పరోక్షంగా తేల్చి చెప్పేశాడు.

జలవివాదాలకిక శాశ్వత పరిష్కారం..!

కృష్ణా జలాల వినియోగంపై టెలీమెట్రీ యంత్రాలు

ఇరు రాష్ట్రాలు.. జల్‌శక్తి అధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులతో కమిటీ

శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు ఏపీ అంగీకారం...

జీఆర్ఎంబీ తెలంగాణలో.. కేఆర్ఎంబీ ఆంధ్రప్రదేశ్‌లో...

ఢిల్లీ- వాస్తవం:

తెలంగాణ సర్కార్ తీసుకున్న చొరవ, కృషితో జల వివాదాల శాశ్వత పరిష్కారానికి నాంది పడింది. నీ వాటా ఎంత..? మా వాటా ఎంత..? జల దోపిడీ చేసింది మీరంటే మీరు.. అనుకునే పరిస్థితులు లేకుండా జరిగిన చర్చలు సఫలమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న జల వివాదాల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఈ మేరకు ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాకు వివరించారు. గోదావరి, కృష్ణా... వాటి ఉప నదులపై నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు... నిర్మాణ ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టులు, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల్లోని వివిధ అంశాల పరిశీలనకు ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, జల్‌శక్తి అధికారులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని సీఎం వెల్లడించారు. జల్‌శక్తి, ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల కమిటీ గోదావరి, కృష్ణా నదుల నీటి కేటాయింపులు, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నసమస్యలను ఆ కమిటీ పరిశీలించి చర్చిస్తుందని సీఎం వెల్లడించారు. ఆ తర్వాత ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై పైస్థాయిలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. కృష్ణా నది జలాల్లో ఏ రాష్ట్రం ఎంతమేర వినియోగించుకుంటున్నదనే విషయంపై టెలీమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని తాము ప్రతిపాదించగా... దానికి ఆంధ్రప్రదేశ్ అంగీకరించిదన్నారు. ఈ రకంగా ఒక సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు భద్రతకు సంబంధించి జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ), ఇతర సంస్థలు తెలిపిన వివరాలపై చర్చించి మరమ్మతుల విషయాన్ని ప్రస్తావించగా.. మరమ్మతులు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించిందని సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం... తర్వాత కాలంలో జరిగిన అపెక్స్ కమిటీలో గోదావరి నది యాజమాన్య బోర్డు, కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాలను ఒక్కో రాష్ట్రంలో ఒక్కోటి ఏర్పాటు చేయాలని పేర్కొన్నారని.. గోదావరి నదియాజమాన్య బోర్డును తెలంగాణలో, కృష్ణా నది యాజమాన్య బోర్డును ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు.

లేటైనా లోకల్ బాడీకి వేళాయే ...!

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్

ఎంపీటిసి, జడ్పీటిసి స్థానాల ఖరారు

రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు

566 ఎంపీపీ, జడ్పీటీసీ, 5,773 ఎంపీటీసీ స్థానాలు